
నేటి దినపత్రిక
సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం | 12 మార్చి 2025 | పేజీలు 8

# రంగనాథునికి సూర్యప్రభ, హంస వాహన సేవ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనం అలంకరణలో మంగళ వాయిద్యాలతో శ్రీస్వామి వారిపేట ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉభయకర్తలుగా రంగాచారి వెంకటేష్, హేమ దంపతులు వ్యవరించారు. రాత్రి స్వామివారు హంస వాహనంపై విహరించారు. ఉభయకర్తలుగా కంచకర్ల సతీష్ చంద్రగుప్త, మాలిని దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఆళ్ళ శ్రీనివాస రెడ్డి, దేవస్థాన సిబ్బంది ఇంకా ఆలయ అర్చకులు పాల్గొన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## వైఎస్ జగన్‌ను కలిసిన గూడూరు




**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాం గ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని వారి నివాసంలో ఇందుకూరు పేట మండల సీనియర్ నాయకులు గూడూరు ప్రభాకర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

### అసెంబ్లీలో సర్వేపల్లి ఎమ్మెల్యే

# సోమిరెడ్డి అబద్ధాలు

- అక్రమ కేసులు నిరూపించుకోవాలి
- మాజీ మంత్రి కాకాణి ధ్వజం

2లో..




- అలంకారంగా మారిన కొనుగోలు కేంద్రాలు
- రైతులకు నిబంధనలు, మిల్లర్లకు ప్రయోజనాలు

## వరి ధాన్యం

# రైతు దైన్యం!



ఆరుకాలం శ్రమించే హలానికి అనాదిగా అరకొర ఊరటే దక్కుతుంది. అడుగడునా రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. అందరికీ ఆహారాన్ని అందించే ధాన్యం రైతులకు అయిదు వేళ్లు నోట్లోకి పోవడం లేదు. సాగు గిట్టుబాటు కాగా.. నష్టాలు పెరిగి అప్పుల పాలవుతున్నారు. రైతేరాజు అని ఓవైపు చెపుతున్నా, రైతు శ్రమకు మిగిలింది చెమట చుక్కలు మాత్రమే.. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతును ఆదుకోవాలని కోరుతున్నారు. - *వివరాలు పరిశీలిస్తే..*

***జలదంకి, మేజర్‌న్యూస్ :***

నెల్లూరు జిల్లాలో వరి పండించిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ధాన్యం అమ్ముకోవాలంటే విపరీతంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాది కంటే ధాన్యానికి మార్కెట్లో డిమాండ్ ఉన్నప్పటికీ మిల్లర్లు సిండికేట్‌గా మారి ధరలను పాతాళానికి దిగజారుస్తు న్నారు. గత ఏడాది పుట్టి ధాన్యం 24 వేలు ఉండగా, ప్రస్తుతం 17 వేలు కూడా దాటని పరిస్థితి. ఇటీవల సివిల్ సప్లై అధికారులు, జిల్లా అధికారులు, కొనుగోలు కేంద్రాలు సందర్శించి రైతులు, మిల్లర్లతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సమావేశాల్లో రైతులు ప్రస్తుతం ధరలు గిట్టుబాటు కావడం లేదని, అంతేకాకుండా దిగుబడి కూడా తక్కువగా ఉందని వారి వద్ద ఆవేదన వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఏడాది నెల్లూరు జిల్లాలో సుమారు 7.5 లక్షల ఎకరాలో

-మిగతా 2లో

### ఏపీలో పరిశ్రమల స్థాపనకు కేంద్రం అందిస్తున్న

# సహకారం ఏంటి?



## లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రశ్న

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం ఏమిటని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించి ఆయన లోక్‌సభలో పలు ప్రశ్నలు వేశారు. 2024 నుంచి రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అనుబంధంగా కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుందో వివరించాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలు తెలియజేయాలని కోరారు. డిపార్ట్మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) ద్వారా ఏదైనా పథకాలు అమలు చేయబడుతున్నాయా.. అని ఆరా తీశారు. ఏపీలో గత ఐదేళ్లలో, ప్రస్తుత సంవత్సరంలో డీపీఐఐటీ ద్వారా వివిధ పథకాల కింద మంజూరు చేయబడిన నిధుల వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్

-మిగతా 2లో

### హిందూ ఆచారాల్లో

# సుదర్శన హోమం శక్తివంతమైంది



***పొదలకూరు, మేజర్‌న్యూస్ :***

హిందూ ఆచారాల్లో సుదర్శన హోమం శక్తివంతమైందని శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి పేర్కొన్నారు. పొదలకూరులోని లక్ష్మీ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో భాగవత సప్తాహ వేడుకల్లో భాగంగా మంగళవారం సుదర్శన హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ హోమంలో పాల్గొన్న వారికి ప్రతి కూల ప్రభావం నుంచి విముక్తి లభించడమే కాకుండా శత్రువులపైనా విజయం సాధిస్తారని, దుష్టశక్తుల పీడ విరగడవుతుందని తెలిపారు. మరణాన్ని జయించే శక్తి ఈ హోమానికి ఉందని పేర్కొన్నారు. భక్తుల చుట్టూ ఒక రక్షణ కవచాన్ని సృష్టి స్తుందని, మంత్రవిద్య, దుష్ట కన్ను, ప్రతికూల ఆత్మలు వంటి హానికరమైన అంశాల నుండి వారిని రక్షిస్తుం దన్నారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు పెంద్యాల రమణయ్య నాయుడు, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో ముచ్చింతల్‌కు చెందిన చిన జీయర్‌స్వామి శిష్యులు హేమంత్‌స్వామి, గంగినేని రవీంద్రనాధ్– గీతాంజలి, రాయపనేని శివప్రసాద్ – స్వర్ణ, పెంద్యాల సుధీర్ నాయుడు – లక్ష్మి, గంగినేని సురేష్ నాయుడు – స్వప్న దంపతులు పాల్గొన్నారు.

# ఏపీలో పరిశ్రమల స్థాపనకు కేంద్రం అందిస్తున్న సహకారం ఏంటి?

*(మొదటి పేజీ తరువాయి)*

లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. పరిశ్రమ అనేది రాష్ట్ర అంశమని, ఆయా రాష్ట్రాలు వాటి అవసరాలకు అనుగుణంగా తమ సొంత పారిశ్రామిక విధానాలను రూపొందించుకుంటాయన్నారు. అయినప్పటికీ దేశంలోని వివిధ ప్రాంతాలలో పారిశ్రామికీకరణను ప్రోత్సహించేందుకు కేంద్రం ఎప్పటికప్పుడు అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ) వంటి వాటి ద్వారా రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించడానికి, దేశీయ, విదేశీ పెట్టుబడులను పెంచడానికి కేంద్రం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఇండియన్ ఫుట్వేర్ అండ్ లెదర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం, ఈశాన్య పారిశ్రామిక, పెట్టుబడి ప్రోత్సాహక విధానం, నేషనల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్ (ఎన్ఐపీ), పీఎం గతి శక్తి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటివి ఉన్నాయన్నారు. దేశవ్యాప్తంగా పరిశ్రమల స్థాపనను సులభతరం చేసేలా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)లో సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. డీపీఐఐటీ కింద, నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా ఇప్పటి వరకు వివిధ రాష్ట్రాల్లో 20 ప్రాజెక్టుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్లో కృష్ణపట్నం నోడ్, కొప్పర్తి ఇండస్ట్రియల్ ఏరియా, ఓర్వకల్ ఇండస్ట్రియల్ ఏరియా అనే 3 ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వబడిందని చెప్పారు. గత 5 సంవత్సరాలు, ప్రస్తుత సంవత్సరంలో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (ఎన్ఐసీడీఐటీ) కింద ఆంధ్రప్రదేశ్‌కు డీపీఐఐటీ 531.36 కోట్లను అందించిందని చెప్పారు. ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా మైక్రో అండ్ స్మాల్ ఎంటర్ప్రైజెస్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం (ఎంఎస్ఈ–సీడీపీ)ని అమలు చేస్తోందని, ఈ పథకం కింద 2024–25లో ఆంధ్రప్రదేశ్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి (ఐడీ) ప్రాజెక్టుల కోసం రూ. 4966.595 లక్షలు విడుదలయ్యాయని చెప్పారు.


టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ 7 పీఎం మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్స్ రీజియన్, అపెరల్ (పీఎం మిత్ర) పార్కులను 2021–22 నుంచి 2027–28 మధ్య ఏర్పాటు చేసేం దుకు రూ. 4,445తో ఆమోదించిందని చెప్పారు. అలాగే టెక్స్‌టైల్స్ రంగం లో పెట్టుబడులను పెంచడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం, ఎగుమ తులను పెంచడమే లక్ష్యంగా మంత్రిత్వ శాఖ స్కీమ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్స్ పార్క్ (ఎస్ఐటీపీ) పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్ఐటీపీ ఆధ్వర్యంలో నాలుగు టెక్స్‌టైల్స్ పార్కులు ఉన్నాయని, వాటిలో ఒకటి పూర్తవగా, 3 వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు.

## ప్రసన్న వెంకటేశ్వర స్వామికి కొండ్రెడ్డి ప్రత్యేక పూజలు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారికి మంగళవారం సాయంత్రం నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి హనుమంత సేవా కార్యక్రమానికి విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి ఉభయకర్తగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ఆలయ అర్చకులు స్వామివారి హనుమంత సేవను పురస్కరించుకొని ఉభయకర్త విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డికి శ్రీస్వామివారి దివ్య ఆశీస్సులు అందించారు.



## అసెంబ్లీలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి అబద్ధాలు




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** పవిత్రమైన అసెంబ్లీలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సోమిరెడ్డిపై 18 అక్రమ కేసులు పెట్టినట్లు అసెంబ్లీలో చెప్పారని, దాన్ని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. 18 కేసుల జాబితాను అసెంబ్లీలో చదివే దమ్ము ఆయనకు ఉందా.. అని ప్రశ్నించారు. రాత్రంతా స్టేషన్‌లో ఉంచినట్టు నిరూపిస్తావా అని కోరారు. పొలాన్ని ఆక్రమించిన కేసులో కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు పెట్టారని పేర్కొన్నారు. రాజకీయాల్లోకి వచ్చి కోట్లు సంపాదించిన చరిత్ర సోమిరెడ్డిదన్నారు. రస్తుం మైన్‌లో వాటా ఇవ్వలేదని సోమిరెడ్డి దీక్ష చేశారు తప్ప, అక్రమాలు జరిగాయని కాదన్నారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేసింది సోమిరెడ్డి అనుచరులే అన్నారు. గ్రావెల్ దోచుకున్న వారే గత ఎన్నికల్లో సోమిరెడ్డికి డబ్బులు ఇచ్చారని చెప్పారు. మేము ఫోర్జరీ చేస్తే.. తమ హయాంలో కేసు ఎలా పెడతామన్నారు. ఆర్డీఓ సంతకాన్ని సోమిరెడ్డి కొడుకు ఫోర్జరీ చేశారని ఆ కేసును తొక్కిపెట్టారన్నారు. సిలికా వ్యాపారంలో లాభాల కోసం లోకేష్ మీద, ప్రభుత్వం మీద తప్పుడు వార్తలు రాయించిన చరిత్ర సోమిరెడ్డిదన్నారు.

# వరి ధాన్యం.. రైతు దైన్యం !






*(మొదటి పేజీ తరువాయి)*

రైతులు వివిధ రకాల వరి సాగు చేపట్టారు. అయితే వాతావరణం పరిస్థితుల కారణంగా రైతులకు దిగుబడులు దారుణంగా పడిపోయాయి. ప్రస్తుతం జిల్లాలో 15శాతం మాత్రమే వరి కోతలు జరిగాయి. ఈనెల రెండో వారం నుండి వరి కోతలు పూర్తిస్థాయిలో ఊపందుకుంటాయి.

### అలంకారంగా మారిన కొనుగోలు కేంద్రాలు

జిల్లావ్యాప్తంగా సుమారు దాదాపు 300 వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లుజిల్లా అధికారులు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తిక్, డీఏవో సత్యవాణి, తదితరులు సందర్శిస్తూ కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ రైతులకు ప్రకటించిన ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తామని చెబుతున్నారు. అలాగే మండల స్థాయి అధికారులు రైతులకు న్యాయం చేస్తామంటూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. కానీ మిల్లర్లు, దళార్లు ధరలు తగ్గించే ప్రయత్నాలు చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సమాచారం కూడా లేదన్నారు. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో దాన్యం తేమ శాతం చూడ్డానికి కూడా మాయిశ్చర్ మేషిన్లు కూడా కొన్నిచోట్ల అందుబాటులో లేవు అని రైతులు చెబుతున్నారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతానికి ఆరబెట్టుకోవాలన్న కల్లాలు అందుబాటులో లేవని కనీసం గోతాలు, రవాణా వసతి కూడా లేదని రైతులు వాపోతున్నారు. అయితే రైతులు గోతాలు, రవాణా సమకూర్చుకుంటే ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది అంటూ అధికారులు చెబుతున్నారు అంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. రైతులకు గోతాలు ఇచ్చి ఆరబెట్టిన ధాన్యాన్ని కోతాల్లో నింపిస్తున్నారే కానీ ఆ ధాన్యాన్ని మిల్లుకు తరలించేందుకు కొనుగోలు కేంద్రాల సిబ్బంది చర్యలు తీసుకోవడం లేదు మేము ప్రభుత్వం చెప్పిన ప్రకారం చేస్తున్నామని బుకాయిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల సిబ్బంది తమకు జిపిఎస్ సౌకర్యం ఇంకా కల్పించడం లేదని చెబుతున్నారు. రైతులు మాత్రం పండించిన ధాన్యాన్ని బయట దళారులకు అమ్ముకోలేక ఇటు ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోలేక చితికి పోతున్నారు. ప్రతి ధాన్యం కొను గోలు కేంద్రాల్లో జీపీఎస్‌ను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని రైతులు ప్రశ్ని స్తున్నారు.

### మిల్లర్ల దోపిడీ :

ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 17% తేమతో ధాన్యాన్ని సీఎంఆర్ కింద మిల్లుల వద్దకు తీసుకొని వెళితే ప్రతి బస్తాకు మూడు నుండి నాలుగు కేజీలు తరుగు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మిల్లు వద్దకు తీసుకువెళ్లిన ధాన్యాన్ని అన్లోడింగ్ చేయకుండా రైతులను వేధిస్తున్నారు. దీంతో రైతులు ఒకపక్క బస్తాల్లో ధాన్యం తడి ఆరిపోతుందని, రవాణా చార్జీలు పెరుగుతున్నాయని బాధతో మిల్లర్లు అడిగిన కాడికి దాన్ని విచ్చేసి చేతులు దులుపుకుంటున్నారు. కొందరు రైతులు అయితే ఈ బాధలు పడలేక దళారులకు కాలాల్లో అమ్ముకుంటున్నారు.

### రైతులకు నిబంధనలు మిల్లర్లకు ప్రయోజనం :

ధాన్యం క్రయ విక్రయాలలో అన్నదాతలు అడుగడుగునా దగాకు గురవుతున్నారు. ఒకపక్క మిల్లర్లు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 19,70 ఉంటే దానికి కొనుగోలు చేయడం లేదు మిల్లర్లు కూడా దళారుల అవతారం ఎత్తి 17.18 వేలకు పుట్టి ధాన్యాన్ని కొనుగోలు చేసుకుని తన మిల్లులకు తరలించుకుంటున్నారు. రైతులు గత ఏడాది పుట్టి ధాన్యం 25 వేలకు అమ్ముకుంటే ఇప్పుడు 17,000 కూడా కొనడం లేదని వాపోతున్నారు. మిల్లర్లకు మాత్రం డ్రయ్యర్ చార్జీల కింద పుట్టికి 500 రూపాయలు ప్రభుత్వం అందజేయడం విస్మయం కలిగిస్తుందని రైతులు వాపోతున్నారు.

విత్తనం నాటడం నుంచి ధాన్యం అమ్ముకునే వరకు రైతు కష్టం నష్టం పడాల్సిందే. ఇన్ని కష్టాలు పడి ప్రభుత్వం మద్దతు ధర అమ్ముకోవాలన్న నిబంధనలు ఎక్కువ కావడంతో రైతులు బయట మార్కెట్‌ని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా అధికారుల స్పందించి ధాన్యం కొనుగోల కేంద్రాల్లో జిపిఎస్ ను వెంటనే ఏర్పాటు చేసి ప్రతి రైతుకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

మాది జలదంకి మండలం ఎల్ఆర్ అగ్రహారం గ్రామం నేను ఈ ఏడాది మా పొలంలో ఐదున్నర ఎకరాల వరి పంట సాగు చేశాను. ఏడాది దిగుబడి కూడా పూర్తిగా తగ్గిపోయింది. బయట మార్కెట్లో పుట్టి ధాన్యం గత ఏడాది 24 వేలు ఉంటే ఇప్పుడు 18 వేలకు కూడా కొన్ని దిక్కులేదు. దీంతో దాన్ని అమ్ముకోవడానికి జలదంకిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద నా పేరు నమోదు చేసుకున్నాను. ఈనెల 4న నా పేరు నమోదైంది. అయితే ప్రస్తుతం నా ధాన్యాన్ని ఇంతవరకు కొనుగోలు చేయలేదు. కొనుగోలు సిబ్బంది ప్రశ్నించగా జిపిఎస్ లేదని చెబుతున్నారు. ఇప్పటికే నా ధాన్యం గోతాల్లో నింపి దాదాపు 5 రోజులైది. వాటిని కాపాడుకోవడానికి నానాయాత్ర పడుతున్నాను. కొనుగోలు కేంద్రాల్లో మాత్రం జిపిఎస్‌పై అధికారుల ద్వారానే వస్తుందని అంతవరకు ఉండాల్సిందే అని చెబుతున్నారు. రాత్రి వేళలో వర్షం వస్తే నా పరిస్థితి ఏంటని ఆ రైతు వాపోతున్నారు. ఉన్నత అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో జిపిఎస్ ను ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు.



గొట్టిపాటి రాధాకృష్ణ, రైతు

# హిందూ సంప్రదాయాలు ఆలయాలపై వైసీపీ దాడి



- వైసీపీ హయాంలో హిందూ మత సాంస్కృతి సంప్రదాయలను నిర్వీర్యం చేశారు..
- వైసీపీ పాలనలో దేవాలయాలపై జరిగిన దాడులు, హిందూ మతానికి జరిగిన అవమానం

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** మార్చి 11 2019 నుండి 2024 మధ్య కాలంలో రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో విగ్రహాలు ధ్వంసం చేయడం, రథాలను తగలబెట్టడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలపై జరిగిన విచారణ, నమోదైన కేసులు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై దేవాదాయ శాఖ మంత్రి శాసన మండలిలో సభ్యుల ప్రశ్నకు మంగళవారం సమాధానం ఇచ్చారు. మంత్రి అనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో దేవాలయాలపై దాడులకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు వందల సంఖ్యలో ఘటనలు నమోదయ్యాయి. ఇందులో చాలా వరకు నిర్లక్ష్య వైఖరితో సరిపెట్టారు. అప్పటి ప్రభుత్వం ఈ ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిపోయి, మౌనంగా ఉండడం గమనార్హం అన్నారు. హిందూ భక్తుల మనోభావాలను గౌరవించకుండా ఆ ఘటనలను నిర్లక్ష్యంగా పరిగణించారని మంత్రి మండి పడ్డారు. మన ధర్మం మనకు రక్షణగా నిలవాలంటే ప్రభుత్వ పాలకులు భక్తులు మనోభావాలను గౌరవించాలి, దేవాలయాల ప్రతిష్టను కాపాడాలి అని, కానీ గత వైసీపీ హయాంలో దేవాలయాలపై జరిగిన దాడులను నిర్లక్ష్యం చేయడమే కాదు దోషులను కాపాడేందుకు చిత్తశుద్ధి లేని విచారణలు జరిపింది అని మంత్రి ఆనం ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019-24 మధ్య కాలంలో అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి రథం దహనం, బిట్రగుంట రథం కాలిపోవడం ఆంజనేయస్వామి తోక విరగొట్టడం, ఇలా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు వందల సంఖ్యలో కేసులు నమోదయ్యాయని అలాగే చాలా దేవాలయంలో భద్రత సమస్యలు రాష్ట్రవ్యాప్తంగా విగ్రహాల ధ్వంసం ఇవన్నీ హిందూ సమాజాన్ని కలవరపరిచాయని మంత్రి గుర్తు చేశారు. ప్రభుత్వం కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ దేవాలయాల విషయంలో బాధ్యతగా వ్యవహరిస్తుంది అని ఏదయినా చిన్న చిన్న ఘటనలు జరిగితే తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటుంది అని తెలిపారు. గతంలో జరిగినటువంటి ఘటనలను పునరావృతం కాకుండా అందు కొరకు ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేసి గతంలో నిర్లక్ష్యం చేసిన కేసులపై సమగ్ర విచారణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే ప్రముఖ దేవాలయాల్లో సీసీ టీవీ సర్వైలెన్స్, భద్రతా సిబ్బంది నియామకం కూడా జరుపుతున్నట్లు మంత్రి ప్రకటించారు. భవిష్యత్‌లో దేవాలయాలపై దాడులకు పాల్పడిన వారిపై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే దేవాలయాల సంస్కృతిని సాంప్రదాయాలను తిరిగి స్థాపించినందుకు, భక్తులకు మరింత సౌకర్యాలు అందించేందుకు, భక్తి పరిపూర్ణమైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణ మా ప్రభుత్వ ధ్యేయం. గుడులపై దాడి అంటే భక్తుల మనోభావాలపై దాడి, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు.

# స్కూలు ముంగిట ఆందోళనకరంగా సైడుకాలువ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని రవితేజ కళ్యాణమండపం సమీపంలోని శ్రీచైతన్య స్కూలు ముంగిట రోడ్డుఅంచున సరైన సైడు కాలువలేకపోగా సిమెంటు రోడ్డు కావడంతో ప్రక్కన లోతైన అంచు కాలువగా నీరు వెళుతుండగా ఆందోళనకరంగా కన్పిస్తోంది. రోడ్డుకు అంచుగోడ లేనందున లోతుగా కాలువ ఉండడంతో విద్యార్థులు ప్రమాదవశాత్తు జారిపడే అవకాశం ఉంది. అదీగాక ఈకాలువలో నీరు సక్రమంగా సాఫీగా వెళ్ళే పరిస్థితి లేనందున నిల్వ ఉంటూ బురదగా దుర్గంధభరితంగా ఉంటోంది. నిత్యం విద్యార్థులు, ఆమార్గాన వెళ్ళే జనాలు ఇబ్బందిపడే పరిస్థితి కన్పిస్తోంది. ఈకాలువ విషయం, అక్కడ పాఠశాల ఎదుట ఆందోళనకర పరిస్థితి గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్ళిపా పట్టించుకోలేదు. పాలకులు తరచూ చూస్తూనే ఉన్నా ఏమాత్రం స్పందించడం లేదు. మరి ఇప్పటికైనా అక్కడి పరిస్థితి గమనించి కాలువ నిర్మించడం, అంచున రక్షణగోడలు నిర్మించడం తదితర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# మీరు సాగు చేస్తున్న భూములు ప్రభుత్వ పరమైనవి



## సబ్సిడీలు వచ్చే అవకాశం లేదన్న మత్స్య శాఖ

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మీరంతా సాగు చేస్తున్న భూములు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఇండస్ట్రియల్ భూములుగా చూపిస్తున్నాయని రికార్డు పరంగా అదేకనపడుతుందని కృష్ణపట్నం ఆక్వా సాగు రైతాంగానికి జిల్లా మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు తెలియజేశారు. మంగళవారం కృష్ణపట్నం గ్రామంలోని సాయిబాబా ఆలయం నందు బకింగ్ హామ్ కెనాల్- సముద్ర తీర ప్రాంతం భూభాగం మధ్యన ఆక్వా సాగు చేస్తున్న రైతాంగానికి ఏపీఎస్ ఏడీఏ చట్టం, ఆక్వా జోనేషన్, ప్రభుత్వ నియమాలు తదితర అంశాల పైన అవగాహన సదస్సు కార్యక్రమాన్ని మత్స్య శాఖ నిర్వహించింది. జాయింట్ డైరెక్టర్‌తోపాటు వివిధ మండలాల మత్స్య అభివృద్ధి అధికారులు, గ్రామ సచివాలయాల సహాయకులు, సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ మాట్లాడారు. పట్టా భూముల కలిగిన ఆక్వా రైతాంగానికి ప్రభుత్వ రాయితీలు కల్పించబడతాయన్నారు. 80 మందికి పైగా సాగు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూములను ఆయన సూచించారు. ప్రభుత్వ రైతులు పొందేందుకు మీరంత అనర్హులని జెడి చెప్పారు. సర్వేనెంబర్ 756, 833లో ఉన్న భూములు రిలయన్స్ ప్రాజెక్టు, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల మౌలిక సదుపాయాల కల్పన సంస్థకు కేటాయింపులు ఉన్నాయని జెడి పేర్కొన్నారు. దీంతో ఆక్వా సాగు చేస్తున్న రైతులు జాయింట్ డైరెక్టర్ సమాధానం పట్ల అసంతృప్తి చూపారు. రెవెన్యూ పరంగా సర్వే నివేదికను ఆధారంగా మాట్లాడుతున్నామని జాయింట్ డైరెక్టర్ అన్నారు. దీంతో కొంతసేపు అధికారులకు ఆక్వా రైతులకు వాగ్వాదం జరిగింది. ఆన్‌లైన్ నందు ఇండస్ట్రియల్ భూములుగా రద్దు చేసుకుంటే ప్రభుత్వ రాయితీలు వస్తాయని ఆయన అన్నారు. తదుపరి స్థానిక సముద్ర మత్స్యకారులకు అంతరించిపోతున్న సముద్రపు జీవాలు పరిరక్షణ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షులు రాగాల శివకృష్ణ, స్థానిక గ్రామ సచివాలయం మత్స్యశాఖ సహాయకులు వెంకటేశ్వర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 18వ వార్డులో ప్రజా చైతన్య యాత్ర




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్రజా సమస్యలపై ప్రజా చైతన్య యాత్ర మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని 18వ వార్డులో సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి కొపోలు డేవిడ్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. 18వ వార్డులో ఇంటింటికి తిరిగి ప్రజల వద్ద నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా కొత్తగా పెళ్లి అయిన వారికి రేషన్ కార్డులు లేవని, అలాగే భర్తలను కోల్పోయిన మహిళలకు సంవత్సరం దాటినప్పటికీ ఇప్పటివరకు పెన్షన్ రాలేదని ప్రజలు సమస్యలను తెలిపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డేవిడ్ రాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారం వచ్చే తొమ్మిది నెలల గడుస్తున్న ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆయన అన్నారు. వెంటనే ప్రజా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు గుల్జర్ బేగం, వినుకొండ పద్మ, సుమతి, రమణయ్య, గంధళ్ల పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముసునూరు వారి పాలెం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఈ-పంట సామాజిక తనిఖీపై గ్రామసభ జరిగింది. సర్పంచ్ మునుకూరు జనార్దన్‌రెడ్డి నీటిపారుదల సంఘం అధ్యక్షులు రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడీఏ రాజ్‌కుమార్ మాట్లాడారు. ఈ పంటలో ఇప్పటివరకు నమోదు చేసినటువంటి రైతుల జాబితాను గ్రామసభలో తెలియజేసి ఏదైనా సవరణలు ఉన్నచో గ్రామ విఏఏకు వివరిస్తూ సరిచేయాలని సూచించారు. ఈ పంటలో నమోదు అయినటువంటి రైతులు మాత్రమే ధాన్యం కొనుగోలుకు అర్హత కలిగి ఉంటారని కావున ప్రతి ఒక్క రైతు కూడా ఈ పంటను ముందుగా చేయించుకోవాల్సిందిగా తెలిపారు. ప్రభుత్వం ద్వారా దాన్యం కొనుగోలు విషయమై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ జోత్స్న రాణి, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు శిక్షణ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక ప్రగతి జూనియర్ కళాశాలలో సోమవారం మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ పఢాయి భీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్లు ఆర్.సుబ్బరత్నమ్మ, సీహెచ్ రమణమ్మలు మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే 3-6 ఏళ్లలోపు చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యాబుద్ధలు నేర్పించాలన్నారు. కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భవతులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్రాల్లో అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొండిబకాయి పన్నులు వసూలు చేయండి

## కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థకు చెల్లించవలసిన ఆస్తి పన్ను మొండి బకాయిదారుల నుంచి పన్నులను వసూలు చేయాలని కమిషనర్ సూర్యతేజ రెవెన్యూ విభాగం అధికారులను ఆదేశించారు. రెవెన్యూ విభాగం, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పన్ను బకాయిదారులు ఈనెల చివరిలోపు బకాయిలు మొత్తం చెల్లించేలా కృషి చేయాలని సూచించారు. రెవెన్యూ వసూళ్లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్యదర్శులను కమిషనర్ అభినందించారు. మార్చి నెలలో పన్ను వసూళ్లలో ఉన్నత లక్ష్యాలను సాధించిన పది మంది అడ్మిన్ కార్యదర్శులకు ప్రోత్సాహకాలను అందిస్తామని ప్రకటించారు. ఈనెల చివరి నాటికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించని వారికి, తక్కువ శాతం వసూలను చేపట్టిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. గత ఏడాదికన్నా ఈ ఆర్థిక సంవత్సరం 7.5కోట్ల రూపాయలు అధికంగా పనులను వసూలు చేశామని ఇదే విధంగా 100శాతం లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పన్ను వసూళ్లలో ముందు వరసలో నిలిచే కార్పొరేషన్లలో నెల్లూరు నగర పాలక సంస్థను నిలిపేందుకు ప్రతి ఒక్కరు ప్రణాళికా బద్ధంగా వసూళ్లను చేపట్టాలని కమిషనర్ ఆకాంక్షించారు. నక్ష సర్వే ద్వారా గృహాల, భవనాల ఖచ్చితమైన కొలతలు, వివరాలు అందుతాయని తెలిపారు. పన్ను చెల్లించడంలో ఇప్పటికీ జాప్యం చేస్తున్న కమర్షియల్ భవన యజమానులకు ఆస్తి జప్తు చేస్తానని హెచ్చరికలు జారీ చేయాలన్నారు. ఖాళీ స్థలాలకు పన్నులు విధించేందుకు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మార్కెట్ విలువను తెలుసుకుని దాని ప్రకారంగా ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి పన్నులను వసూలు చేయాలని కమిషనర్ ఆదేశించారు. స్థానిక సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ చెరువులో ఫ్లోటింగ్ సోలార్ ప్యానల్ లను బిగించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. నగరాభివృద్ధికి అవసరమైన మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు పన్నుల వసూళ్లు తప్పనిసరి అని, ప్రజలంతా సకాలంలో పన్నులను చెల్లించి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కమిషనర్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు విధానంలో మార్పులు




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం రైతుల కోసం కొత్త ధాన్యం కొనుగోలు విధానాన్ని అమలు చేసింది. కంటేపల్లి, ఈదగాలి గ్రామాలలో ఈ మార్పుల గురించి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తేమ శాతం మినహాయింపు 17శాతం కంటే ఎక్కువ తేమ ఉంటే, ప్రతి 100 కేజీలకు 1 కేజీ అదనంగా తగ్గింపు. ఎకరానికి 40 కేజీ బస్తాల స్థానంలో 75–85 బస్తాలు ఇవ్వబడతాయి. గ్రేడ్–ఎ ధాన్యానికి 850 కేజీలకు రూ.19,720 మద్దతు ధర. ధాన్యం విక్రయించిన 24 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బు జమచేస్తారన్నారు. రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా క్యూపన్ పొందాలి. ప్రతి రైతు 25 ఎకరాల వరకు ధాన్యం అమ్ముకోవచ్చు. గోతాలు, ఎత్తుడు కూలీ, రవాణా ఖర్చులను ప్రభుత్వం భరిస్తుంది. తక్కువ ధరకు దళార్లకు విక్రయించకుండా, ప్రభుత్వ విధానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ ఎన్.శ్రీనివాసులు, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్.శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి డి.హరి కరుణాకర్‌రెడ్డి, రైతు నాయకులు రావూరి రాధా కృష్ణం నాయుడు, సి.నాగార్జున రెడ్డి, ఈపూరు సుబ్బారెడ్డి, బి.రామకృష్ణారెడ్డి, కె.రాధా కృష్ణా రెడ్డి, ఎ.రవి కుమార్, ఎం.లక్ష్మీ నరసింహ, గ్రామ నాయకులు విమలాకర్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు సెంటర్ వద్ద రైతులకు అవగాహన



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలోని తురిమెర్ల సచివాలయం యందు ప్యాడి ప్రోక్రూట్మెంట్ సెంటర్ (పీపీసీ)కి సంబంధించి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వరి ధాన్యాలపై రైతులకు అవగాహన కలిగిస్తూ తేమశాతం 17శాతం కంటే ఎక్కువ ఉన్న వారి దాన్యాన్ని కూడా సేకరించడం జరుగుతుందని, ఆపై ఉన్న ప్రేమ శాతం 1శాతంకి ఉంటే 100 కేజీలకు 1 కేజీ తరుకు చూపపడుతుంది. తేమ శాతం 17 కంటే ఎక్కువ ఉంటే వరి ధాన్యంను ఆరబెట్టుకొని రమ్మని వెనక్కి పంపించడం వెనక్కి పంపించకూడదని కచ్చితంగా తీసుకోవాలి. గవర్నమెంట్ వాహనంలోనే సేకరించిన వరి పంటను తరలించడం జరుగుతుందని రైతులు టాక్టర్ పెట్టుకుంటే వాటికి జిపిఎస్ అమర్చడం జరుగుతుందని గన్ని బ్యాగ్ (గోతం సంచులు) ఎప్పటికప్పుడు సేకరణ కేంద్రంకు తెప్పించడం జరుగుతుంది. రైతు డైరెక్ట్‌గా ఏజెంట్స్‌తో గాని, మిల్లర్‌తో గాని మాట్లాడితే రైతు నష్టపోయే అవకాశం ఉందని మండల ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ మస్తాన్ బాబు, ఈఓ ఆర్డి రాఘవేంద్ర, పంచాయతీ సెక్రెటరీ వైష్ణవి, గ్రామ రైతులు ఇదితరులు పాల్గొన్నారు.

## వివాహానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారస్తులు అయిత శ్రీనివాస్ రావు వారి కుమారుని వివాహం జరిగింది. అనంతరం వారి ఆహ్వానాన్ని అనుకొని నివామునకు వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డితోపాటు వైసీపీ నాయకులు ఉన్నారు.

## గంధపు నలుగు కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణాన్ని పుల్లారెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న మచ్చల మల్లికార్జునరెడ్డి కుమారుని గంధపు నలుగు కార్యక్రమానికి హాజరై అనంతరం నూతన వరుడును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేతో పాటు వైఎస్‌ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ



**బోగోలు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని మంగమూరు, నాగులవరం ప్రభుత్వ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులు విద్యార్థులకు దాతలు కాలువ సాయికృష్ణ, పవన్ కుమార్, రామకృష్ణ సహకారంతో సమాజసేవ కర్త బోద్దుకూరి నారాయణరావు పరీక్షా సామాగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా బొద్దుకూరి నారాయణరావు మాట్లాడుతూ.. బాగా చదువుకొని ఉన్నత స్థాయిలోకి వచ్చి పదిమందికి సహాయం చేసే విధంగా మీ యొక్క జీవనాన్ని, మలుచుకోవాలని చదువుచెప్పిన గురువులకు, తల్లిదండ్రులకు, సహాయం చేసిన ప్రతి ఒక్కరికి, కృతజ్ఞతా భావంతో మెలగాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు మర్లపాటి లక్ష్మీ ప్రసాద్‌బాబు, బలిచాట్ల శ్రీకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

### 17న జరిగే మహాధర్నాను..

## విజయవంతం చేయాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పంచాయితీ కార్మికుల న్యాయ మైన డిమాండ్లను తక్షిణమే పరిష్కరించాలని కోరుతూ ఏపీ పంచాయితీ ఎంప్లాయిస్‌అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈనెల 17న విజయవాడలోని ధర్నాచౌక్‌లో నిర్వహించే మహాధర్నాలో అధిక సంఖ్యలో పంచాయితీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆసంఘ జిల్లా అధ్యక్ష, గౌరవాధ్యక్షులు జి.నాగేశ్వరరావు, కేపీ పెంచలనర్సయ్యలు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తమ సమస్యలు పరిస్కరించాలని గత 30 ఏళ్లుగా పోరాడుతున్నామన్నారు. అప్పటినుండి తమ సమ స్యలు ఏప్రభుత్వం పరిష్కరించకపోవడంతో మహాధర్నా చేపట్టామన్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2025–29 ఆర్థిక సంఘ భారీబడ్జెట్ లో పంచాయితీ కార్మి కుల ఆశలను నీరు గార్చిందన్నారు. ఈమహా ధర్నాకు పంచాయితీ కార్మికులు, గ్రీన్ అంబా సిడర్లు, జిల్లా నుండి అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.

# ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

## రైతులకు ప్రయోజనకరం : తహసిల్దార్ వి.సుధీర్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా, గిట్టుబాటు లభించేలా చర్యలు తీసుకుందని ఆత్మకూరు తహశిల్దారు వి.సుధీర్ పేర్కొన్నారు. భారతప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతాప్రమాణాలకనుడుణంగా రైతులనుండి ధాన్యం కొనుగోలు చేసేలా నిర్ణయించారన్నారు. ఈ-పంట, ఈకేవైసీ పూర్తియిన రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుటకు సిద్ధమైన రైతులు నుండి మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఆత్మకూరు మండలంలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటుచేసిందని, సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటయ్యాయని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ధాన్యం కొనుగోలు చేసే ప్రతి రైతునుండి బయోమెట్రిక్ (వ్రేలిముద్రలు)రైతుసేవా కేంద్రంలో వేయాలని, ధాన్యం వాహనంలో లోడింగ్ అయినప్పటినుండి మిల్లువద్ద అన్‌లోడింగ్ అయ్యేంతవరకు జిపిఎస్ పరికరం ద్వారా ట్రాక్ చేయబడుతుందని తహసిల్దారు వివరించారు. ప్రభుత్వమే గోనెసంచులు, హమాలీచార్జీలు భరిస్తుందని, ఒక వేళ రైతులు సమకూర్చుకుంటే ఆ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని సుధీర్ పేర్కొన్నారు. గ్రేడ్ ఏ రకం ధాన్యం పుట్టికి 19720 రూపాయలుగా ప్రభుత్వం కనీసమద్ధతు ధరగా నిర్ణయించిందని, సాధారణరకం పుట్టికి 19550రూపాయలుగా నిర్ణయించిందని, నిర్ణీత నాణ్యతాప్రమాణాల ప్రకారం ఆధరలకు తగ్గకుండా ధాన్యంను కొనుగోలు చేస్తారని ఆయన వివరించారు. దళారుల మాటలు నమ్మి ప్రవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించి నష్టపోరాదని ఆయన సూచించారు. ప్రభుత్వం రైతులకు ప్రయోజనం కల్గించేలా, నష్టపోకుండేలా ఈ చర్యలు తీసుకుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని సుధీర్ కోరారు. రైతులు ధాన్యం ప్రభుత్వంకు విక్రయించదలచిన తేదీనుండి కూపన్‌ను రైతులకు అందజేస్తారని, ఫోన్‌ద్వారా సమాచారం ఇస్తారని ఆయన తెలిపారు. నిర్దేశించిన తేదీలో సాంకేతికనిపుణులు వచ్చి ధాన్యం నమూనాలు సేకరించి నాణ్యతాప్రమాణాలను విశ్లేషించి నిబంధనలమేరకు ఉంటే సదరు ధాన్యంను స్వీకరిస్తారని ఆయన వివరించారు. కేంద్రప్రభుత్వ నాణ్యతాప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని స్వీకరించి సదరు రైతు లేదా నామినీ యొక్క బయోమెట్రిక్ తీసుకుంటారని, ఎఫ్‌టివో (రశీదు) అందజేయబడుతుందని, రైతులు అమ్మిన పరిమాణం, విలువ వివరాలను ఫోన్‌ద్వారా సమాచారం పంపుతారని ఆయన తెలిపారు. సేకరించిన ధాన్యాన్ని రైతు కోరిన రైస్‌మిల్లుకు సిపిఎస్‌తో కూడిన వాహనంలో రవాణా చేస్తారని, అన్‌లోడ్ చేసుకొని ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారని, ఈ సమాచారాన్ని ఫోన్‌ద్వారా అందజేస్తారని తహశిల్దారు పేర్కొన్నారు. రైతు ఆధార్‌కార్డుకు అనుసంధానమైన బ్యాంక్ ఖాతాకు సొమ్మును జమచేస్తారని తహశలిఆ్దరు వివరించారు. రైతులకు ప్రయోజనకరంగా ఉన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహశిల్దారు సుధీర్ కోరారు.

# 4వరోజు కొనసాగుతున్న సీపీఎం ప్రజా చైతన్యయాత్ర






**ःనెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** సీపీఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో 4వరోజు జరుగుతున్న ప్రజా చైతన్య యాత్రలలో భాగంగా పొట్టే పాలెం గ్రామంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ట్రిప్పర్లతో తోలేందుకు సిద్ధం చేసిన ఇసుక డంపింగ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు నెల్లూరు రూరల్ మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధనలు మాట్లాడుతూ.. పొట్టేపాలెం ఇసుక రీచ్ నుంచి ప్రతిరోజు రాత్రి సమయాల్లో వందలాది ట్రిప్పర్లతో ఇసుక బయట రాష్ట్రాలకు వెళుతుందని లక్షల రూపాయలు అక్రమార్కులకు వెళుతుందని, వెంటనే దీన్ని అరికట్టాలని సంబంధిత అధికారులను కోరుతున్నామన్నారు. అలాగే పొట్టేపాలెంలో ప్రాణాలను హరిస్తూ ప్రమాదాలకు నిలయంగా మారిన దొంగ తూముకి ఇరువైపులా రక్షణ గోడలను ఏర్పాటు చేయాలని, ప్రతినిత్యం నెల్లూరు చెరువు నీళ్లు పొట్టే పాలెం కలుజు గుండా ప్రమాదకరంగా ప్రవహిస్తుండంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కాబట్టి వెంటనే పొట్టే పాలెం కలుజుపై హై లెవెల్ వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని అన్నారు. పొట్టే పాలెం సెంటర్‌లో ప్రధాన రహదారిపై ప్రతిరోజు తిరిగే వాహనాలతో పాటు, ఇసుక రీచ్ నుంచి వందలాది ట్రాక్టర్లు తిరుగుతున్నాయని, టీసీఎస్ అయాన్ ఎగ్జామ్స్ సెంటర్ ఉన్నందువల్ల వందల మంది విద్యార్థులు రోడ్డుపైన తిరుగుతున్నారని దీనితో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సెంటర్‌లో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి రోడ్డుపై తిరిగే వారికి ప్రమాదాలు జరక్కుండా కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నెల్లూరు రూరల్ మండలం కమిటీ సభ్యులు ఎంవి రమణ, ఎడవల్లి రమణయ్య ముత్యాల నాగయ్య, పర్చూరు ప్రభాకర్ ఎస్కే అబ్దుల్లా, విరువూరు వెంకటరమణయ్య శ్రీపతి వెంకట శేషయ్య, పసల వెంకటరమణయ్య, రాజా కాకాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ధాన్యం కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్పేట మండల ప్రత్యేక అధికారి పంచాయతీరాజ్ ఎస్ఈ పి.అశోక్ కుమార్, పేర్కొన్నారు. మంగళవారం ఏఎస్ పేట మండలంలోని శ్రీకొలను, గ్రామంలోని రైతు సేవా కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రైతుల యొక్క సందేహాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలని రైతులు ఎక్కువ మొత్తంలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వం అందించే మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.ప్రసన్నకుమారి, రాజవోలు సొసైటీ సిబ్బంది, రమేష్ రెడ్డి, వీఏఏ టి.తులసి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మండల కార్యాలయం సెంటర్లో బీజేపీ సంబరాలు



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** మంగళవారం ఇందుకూరుపేట మండలం కొత్తూరు గ్రామం మండల కార్యాలయం సెంటర్‌లో భారతీయ జనతా పార్టీ నాయకులు ఢిల్లీలో బీజేపీ గెలిచిన సందర్భంగా సంబరాలు నిర్వహించుకున్నారు. బాణాసంచా పేల్చి స్వీట్స్ పంచారు. ఈ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షులు కైలాసం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో చేవూరు వెంకట్రావు, సిహెచ్ గాంధీ, కేతిరెడ్డి అవినాష్ రెడ్డి, అతిపాటి శరత్, దొంతాల మహేష్, నెల్లూరు శ్రీనివాసులు, నెల్లూరు వెంకటశేషయ్య, లేబూరు సతీష్ రెడ్డి, చిలకూరు సుదీప్ రెడ్డి, ముసలి శ్రీనివాసులు, నేత్రంబాక శివప్రసాద్, తువ్వర రాంబాబు, మేనాటి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన ఆవిర్భావసభకు సంసిద్ధం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ ఆవిర్భావసభ ఈనెల 14వ తేదీ పిఠాపురంలో జరుగనుండగా ఆత్మకూరు నుండి పార్టీ శ్రేణులు తరలి వెళ్ళేందుకు అంతా సిద్ధం చేశారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మండలాల వారీగా బస్సులను, ఇన్‌చార్జ్‌లను ఏర్పాటు చేశారు. ఈనెల13వతేదీన రాత్రికి బస్సులు బయలుదేరతాయని జనసేన నాయకులు పేర్కొన్నారు. ఆవిర్భావ సభకు వెళ్ళేందుకు ఆసక్తిగల జనసైనికులు, వీరమహిళలు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని వారు కోరారు. మామిళ్ళ ఆనందరావు 7893324201 నెంబరుకు సంప్రతించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు కోరారు. మండలాల వారిగా ఇన్‌చార్జ్‌లను కూడా నియమించామని, వారి ఆధ్వర్యంలో ఆవిర్భావ సభకు వాహనాలు తరలివెళతాయని, ఏర్పాట్లు కూడా వారి ఆధ్వర్యంలో జరుగుతాయని పేర్కొన్నారు.

### అంగన్‌వాడీ భవనాల..

# నిర్మాణాలు పూర్తయ్యేదెన్నటికో

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో నిధులకొరత అని, ఇతరత్రా కారణాలని అనేక భవనాలు నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయి దర్శనమిస్తుండడం, పూర్తియిన భవనాలు వివిద కారణాలతో వినియోగంలో లేకుండా నిరుపయోగంగా దర్శనమిస్తుండడం అనాదిగా ఆనవాయితీగా ఉంది. మండలంలోని నువ్వురుపాడు అరుందతీయకాలనీలో గత మూడేళ్లుగా ముళ్ళచెట్ల మధ్య ఒక అర్ధాంతరనిర్మాణ భవనం కన్పిస్తుంటుంది. అది అంగన్‌వాడీ భవనమని, శ్లాబ్‌లెవల్ వరకు నిర్మించి వదిలేశారని కాలనీవాసులు తెలిపారు. నువ్వురుపాడు, మహిమలూరు, అప్పారావుపాళెం, నాగులపాడు, చెర్లోయడవల్లి, సాతానుపల్లి, శ్రీనివాసపురం, పమిడిపాడుల్లో కూడా అదేమాదిరిగా భవనాల నిర్మాణాలు నిలిచిపోయి ఉన్నాయని ఆయా గ్రామాల వారు చెబుతుండేవారు. అప్పట్లో ఒక్కో భవనానికి 7లక్షల రూపాయలవంతున మంజూరు కాగా శ్లాబ్‌లెవల్ వరకు నిర్మించి వదిలేశారని చెబుతుండేవారు. ఆత్మకూరులో పలు భవనాల పరిస్థితి చూస్తే అత్యంత విడ్డూరంగా, విచిత్రంగా ఉంటుంది. 9 సంవత్సరాలుగా ఆర్‌అండ్‌బి అతిథిగృహం భవనం, ఐదేళ్ళుగా ఆర్డీవో, తహశిల్దారు కార్యాలయాలభవనాల నిర్మాణాలు ఇంకా సాగుతూనే ఉన్నాయి. సాతానుపల్లి వద్ద నిర్మించిన పాఠశాల భవనం, కమ్యునిటిహాల్ నిర్మాణం పూర్తయినా నిరుపయోగంగా ఉన్నాయి. మహిమలూరులో డ్వాక్రా భవనం 12సంవత్సరాలుగా శ్లాబ్‌లెవల్‌లో దర్శినమిస్తోంది. ఈవిషయమై అధికారులతో మేజర్‌న్యూస్ మాట్లాడగా ప్రాజెక్ట్ పరిధిలో దాదాపు 20 భవనాలు ఇలాగే ఉన్నాయని, నిధులు కొరతతో పనులు నిలిపివేవామని తెలుపగా తమవంతుగా ఏయి ద్వారా ఏఏ భవనానికి ఎంత నిధులు అవసరమో అంచనాలు వేయించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, ఇంకా నిధులు మంజూరు కాలేదని వారు పేర్కొన్నారు. మరి జిల్లా అధికారులు స్పందించి నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటారేమో చూడాల్సి ఉంది.

# వివాదంతో మనస్థాపంచెంది రైతు ఆత్మహత్యయత్నం



**కావలి, మేజర్‌న్యూస్ :** ఒక పొలం విషయమై వివాదం చెంది మనస్థాపం గురైన రైతు పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నా జరిగింది.ఘటన కావలి రూరల్ మండలం తాళ్లపాలెంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు కొన్ని సంవత్సరాల క్రితం పుచ్చులపల్లి సీతారామిరెడ్డి దగ్గర చలంచర్ల శ్రీనివాసులరెడ్డికి బాధితుడు నూకలపాటి శివప్రసాద్ రెడ్డి మధ్యవర్తి చేసి 10 ఎకరాల 32సెంట్లు పొలంను కొనుగోలు చేయించాడు. అయితే శ్రీనివాసులు రెడ్డి అదే గ్రామానికి చెందిన మంచాల వెంకటేశ్వర్లు, యర్రబోలు శ్రీనివాసులు తన పొలంను కౌలుకు ఇచ్చాడు. అయితే కౌలుదారులు వరి పైరు వేసి వరికోత కోసుకునే సమయంలో అదే గ్రామానికి చెందిన అభిషేక్ రెడ్డి అనే వ్యక్తి ఇది మా తాతల భూమి అంటూ కొంతమందిని తీసుకువచ్చి గొడవలు పడుతున్నాడు. గత కొద్దిరోజుల క్రితం కూడా అభిషేక్ రెడ్డి ట్రాక్టర్‌తో పైరు ను తొక్కించాడని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. బాధితులు పోలీసులు ఆశ్రయించిన వెంటనే పోలీస్ వారు కేసు నమోదు చేశారు. ఇలాంటి వివాద పొలాన్ని కొనిస్తావా అంటూ తన బావ శ్రీనివాసులు రెడ్డి బాధితుడు శివప్రసాద్ రెడ్డిని అడుగుతుండడంతో మనస్థాపం చెందిన శివ ప్రసాద్ రెడ్డి తన భార్య లక్ష్మీకాంతమ్మ ఇరువురు పొలంలో పురుగులు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. ఇది గమనించిన స్థానికులు హుటాహుటిన వారిని కావలి ఏరియా వైద్యశాలకు తరలించడంతో వారి పరిస్థితి విషమంగా ఉండడంతో కావలిలో ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

### విద్యార్థి దశలోనే ప్రాణదారమైన రక్తం గురించి

# అవగాహన కలిగి ఉండాలి : డాక్టర్ రమ్య




**కావలి, మేజర్‌న్యూస్ :** విద్యార్థి దశలోనే మానవునికి ప్రాణదారమైన రక్తం, రక్తం లోని గ్రూపులు, రక్తలేమికి కారణాలు, రక్త సంక్రమిత వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ వైద్యాధికారిణి డాక్టర్ రమ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు తలసేమియా వ్యాధిపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమ్య మాట్లాడుతూ.. విద్యార్థులలో రక్తలేమి లక్షణాలు కనిపిస్తే ఉపాధ్యాయులు తమకు సమాచారమివ్వాలని, తాము వారికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, తలసేమియా, హీమోఫిలియా వ్యాధి ఉన్నవారిని గుర్తించి ఉచితంగా చికిత్స అందిస్తామని పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థి తమ రక్తగ్రూపు తెలుసుకుని, రక్తదానంపై అవగాహన కలిగి ఉండాలని ఆమె వివరించారు.

ఈ కార్యక్రమంలో 140 మంది విద్యార్థులకు రక్తగ్రూప్ పరీక్షలు నిర్వహించి, గుర్తింపు కార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో తలసేమియా డే కేర్ సెంటర్ కన్వీనర్ కె.హరినారప రెడ్డి, జన విజ్ఞాన వేదిక కార్యదర్శి జి.హరనాథ్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఏబి నీరజ, ఆరోగ్య కార్యకర్తలు జి.విజయలక్ష్మి, డి.సుజాత, ఎస్.గాయత్రీ, రెడ్ క్రాస్ రక్తకేంద్రం సిబ్బంది డి.పద్మావతి, జెవి శేషమ్మ, సునీల్, శ్రీనివాసులు రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు

### ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** పర్యావరణ పరిరక్షణకై ప్రభుత్వం నిర్దేశించిన 120 మైక్రోన్ల కన్నా తక్కువ స్థాయి ప్లాస్టిక్ ఆధారిత ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య హెచ్చరించారు. స్థానిక స్టోన్ హౌస్ పేట ప్రాంతంలో 9 ప్లాస్టిక్ ఉత్పత్తుల హోల్సేల్ దుకాణాలపై మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడుల్లో నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్





80 కేజీల ఉత్పత్తులను గుర్తించి సీజ్ చేశారు. దుకాణాల యజమానులకు 60 వేల రూపాయల జరిమానా విధించి, మరోసారి నిషేధిత ఉత్పత్తుల విక్రయాలు జరిపితే దుకాణాలను శాశ్వతంగా సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిషేధిత ఉత్పత్తుల తయారీ, రవాణా, నిల్వ, విక్రయం, కొనుగోలు చట్టవ్యతిరేకమైన చర్యలని ప్రజలంతా అవగాహన పెంచుకుని, బాధ్యతగా ప్రవర్తించాలని సూచించారు. నిషేధిత ఉత్పత్తులపై క్రయ, విక్రయాల పై తమకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ తెలియజేశారు. ఈ దాడుల్లో నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారులు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధిని గత ప్రభుత్వం విస్మరించింది

### ▶ జనసేన పార్టీ నాయకులు బొబ్బేపల్లి సురేష్ బాబు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** గిరిజన కుటుంబాల అభివృద్ధిని గత వైకాపా ప్రభుత్వం విస్మరించిందని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు బొబ్బేపల్లి సురేష్ బాబు విమర్శించారు. మంగళవారం ఆయన కృష్ణపట్నం గ్రామపంచాయతీ గిరిజన కాలనీలో పర్యటన చేశారు. ఈ సందర్భంగా ప్రతి గిరిజన కుటుంబం ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో మౌలిక సదుపాయాలు ఏమీ కల్పించబడలేదని గిరిజనులు వాపోయారు. దీంతో ఆయన స్పందించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ద్వారా అభివృద్ధి జరిగే విధంగా చూస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

# చలో పిఠాపురంకు పిలుపు

### జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించిన జనసేన పార్టీ నాయకులు సిద్దు



**కావలి, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్ టిట్కో చైర్మన్ వేములపాటి అజయ్ పిలుపుమేరకు కావలి పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ నందు పిఠాపురంలో ఈనెల 14వ తేదీన జరుగబోయే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం' కార్యక్రమంకు గోడపత్రికను సిద్దు ఆవిష్కరించారు. అనంతరం నాయకులు సిద్దు మాట్లాడుతూ.. దశాబ్ద కాలంలో ఎన్నో పోరాటాలు ఒడిదుడుకుల తర్వాత అధికార భాగస్వామ్యంతో పండగ వాతావరణంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడ గ్రామంలో జరుగు జనసేన పార్టీ ఆవిర్భావ సభకు కావలి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు తరలిరావాలని పిలుపునిచ్చారు. పిఠాపురం వచ్చే కార్యకర్తలు ఉచితంగా బస్సులు, భోజనాలు ఏర్పాటు చేయడం జరిగిందని 13తేది రాత్రి 8.30గంటలకు కావలి పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద బయలుదేరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి రూరల్ మండలం అధ్యక్షులు తిరుపతి స్వామి, బోగోలు మండల ప్రధాన కార్యదర్శి చంటి, జనసేన నాయకులు చేవూరు నాయబ్, ఉదయ్, మనోజ్, హరీష్, ప్రవీణ్, సాయి, మల్లికార్జున, జయరాం, బ్రహ్మయ్య, ప్రభు, సురేష్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

### బాలికపై అత్యాచారయత్నం

# కేసులో ముద్దాయికి శిక్ష

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలం పడమట నాయుడుపల్లి లో మైనర్ బాలికపై అత్యాచారయత్నం కేసులో ముద్దాయికి శిక్ష విధించినట్లు మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాసరావు సోమవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. మైనర్ బాలిక ఒంటరిగా ఇంట్లో ఉన్న సమయంలో వెంకటేశ్వర్లు అనే వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో నిజ నిర్ధారణ అవ్వడంతో ముద్దాయి వెంకటేశ్వర్లకు ఐదు సంవత్సరాలు జైలు శిక్ష, 25వేల రూపాయలు నెల్లూరు సెషన్స్ కోర్టు విధించినట్లు తెలిపారు. బాలికపై అత్యాచారయత్నం జరిగిన విషయం తెలియగానే ప్రజలు నివ్వెరపోయారు. మర్రిపాడు మండలంలో కూడా ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయా అని చర్చనీయాంశమైంది.

# అధికారుల సమన్వయ లోపం

▶ పేద రైతులకు శాపం ▶ విశిష్ట గుర్తింపు కార్డుకు నోచుకోని భూములు ఎన్నో!

**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :** అధికారుల సమన్వయ లోపంతో రాష్ట్ర ప్రభుత్వం కొందరు రైతుల భూములకు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందే అవకాశం లేకుండా పోయిందని పలు వురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి కలిగిన ప్రతి రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని సూచించింది. అయితే కొన్ని భూములకు మాత్రమే ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య పొందే అవకాశం కొంతమంది రైతులకు కలిగించింది. ప్రతి రైతుకు సంబంధించిన భూమిని విశిష్ట గుర్తింపు సంఖ్యలో నమోదు చేయవలసి ఉండగా, కొన్ని భూములకు సంబంధించి మాత్రమే ఈ విశిష్ట గుర్తింపు సంఖ్యలో నమోదు అవుతున్నాయి. ముఖ్యంగా ఎక్కువ మంది పేద, సన్నకారు రైతులకు డి ఫామ్, అసైన్మెంట్ పట్టాలు ఉన్నాయి. అయితే వారికి రైతు విశిష్ట గుర్తింపు కార్డు పొందేందుకు అవకాశం లేకుండా పోయింది. ముఖ్యంగా రైతులకు సంబంధించిన కొన్ని భూములు మాత్రమే రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందే అవకాశం కలిగింది. దీంతో పేద రైతులు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని పొందలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసైన్మెంట్, డి ఫాం పట్టాలకు సంబంధించి ఉన్న భూములకు పీఎం కిసాన్ వస్తున్నప్పటికీ, అలాంటి భూములకు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందే అవకాశం లేకుండా పోయిందని పలు వురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాంటి భూములకు కూడా ప్రస్తుతం రైతు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య పొందే అవకాశం లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని చెబుతున్నప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం వల్ల కొన్ని భూములు మాత్రమే ఈ వెబ్‌సైట్‌లో నమోదవడం విశేషం. దీంతో అర్హత ఉన్న తమ భూములకు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందలేకపోతున్నామని పలువురు పేద, సన్నకారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాన్ని పూర్తిగా ఆధునికరణ చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఆధార్ తరహాలోనే విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని నిర్ణయించింది. రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే భవిష్యత్తులో రైతులకు రావలసిన అన్ని సౌకర్యాలు పొందే అవకాశం ఉంది. దీంతో రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం వెబ్‌సైట్‌లో డి ఫామ్ పట్టాలు తీసుకోకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై వ్యవసాయ అధికారులను వివరణ కోరగా ఇది తమ పరిధిలో లేదని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉందని అప్పుడే ప్రతి రైతు డిఫాం భూములకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య పొందే అవకాశం ఉందన్నారు.

# సోము వీర్రాజుకు ఎమ్మెల్సీ పదవిపై హర్షం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షులు సోమువీర్రాజు పేరును కూటమి ప్రభుత్వం ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ నెల్లూరు జిల్లా నుంచి ఓబీసీ మోర్చా కోస్తా ఆంధ్ర జోనల్ ఇన్‌చార్జ్ ముక్కు రాధాకృష్ణ గౌడ్, బిజెపి కోపరేటివ్ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ కోట వెంకటేశ్వర్లు, కోవూరు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాఘవేంద్ర తదితరులు విజయవాడలోని రాష్ట్ర కార్యాలయం నందు ఆయనను కలసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోమువీర్రాజు చిన్నతనం నుండి ఆర్ఎస్ఎస్ విద్యార్థి దశలో ఏబీవీపీ అలాగే యువమోర్చా నుండి తన రాజకీయ ప్రస్థానం మొదలై రాష్ట్ర జాతీయ పదవులను నిర్వహించి వాటికి వన్నెతెచ్చారని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని పార్టీ కార్యకర్తలను కాపాడుకున్నారని అటువంటి నాయకునికి పార్టీ రాష్ట్ర నాయకత్వం ఎమ్మెల్సీని కేటాయించడం ప్రతి కార్యకర్త గర్వం చదగినటువంటి విషయమన్నారు. సోమువీర్రాజుకు ఎమ్మెల్సీని ప్రకటించడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలు సంబరాలు జరుపుకుంటున్నారని నిజమైన కార్యకర్తకు గౌరవం దక్కిందని ఆనందిస్తున్నారని, బీజేపీలో మాత్రమే జరుగుతుందని మిగతా రాజకీయ పార్టీలలో సాధ్యం కాదని తెలిపారు.

# చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించండి

**- కమిషనర్ సూర్యతేజ**



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించాలని, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి జరిమానాలు విధిస్తామని కమిషనర్ సూర్యతేజ హెచ్చరించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా నగరంలోని 51వ డివిజన్ ఏబీఎన్ కాంపౌండ్, అరవపాలెం, దందు వారి వీధి, కపాటి పాలెం, రైల్వే ఫీడర్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కమిషనర్ మంగళవారం పర్యటించారు. చెత్త సేకరణ వాహనాల ద్వారా మాత్రమే ప్రతి ఇంటి నుంచి వ్యర్థాలను సేకరించాలని, ఏబీఎం కాంపౌండ్ ప్రాంగణంలో చెత్త వేస్తున్న వారిని గుర్తించి, అపరాధ రుసుము విధించవలసినదిగా ఆదేశించారు. అక్కడ వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించేందుకు గాను సిబ్బందిని నియమించవలసినదిగా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్యకు ఆదేశాలు ఇచ్చారు. స్వచ్ఛ సర్వేక్షన్ సర్వేలో ప్రజలు అందరూ పాల్గొనేలా అవగాహన కల్పించాలని, దోమల వ్యాప్తి నివారణకు ప్రతి ఒక్కరూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్లు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ వార్డు సచివాలయ కార్యదర్శులకు సూచించారు. అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలలో జంగల్ క్లియరెన్స్ చేయించాలని, స్వయంగా శుభ్రపరచుకునేలా ఖాళీ స్థల యజమానులకు నోటీసులు ఇచ్చి, వారి సొంత ఖర్చులతో శుభ్రము చేసుకునేలా చర్యలు చేపట్టాలని శానిటేషన్ విభాగం అధికారులకు సూచించారు. రైల్వే ఫీడర్స్ రోడ్డులో కాలువపై అక్రమంగా నిర్మించిన రాంపులు వల్ల నీటిపారుదలకు అడ్డంకిగా ఉన్నందున అనవసరమైన చోట రాంపులు తొలగించి కాలువలలో నీరుపారుదలకు ఎటువంటి ఆటంకం కలుగకుండా తగిన చర్యలు చేపట్టాలని, అలాగే రోడ్డుపై నిరుపయోగ స్థితిలో నిలిపియున్న వాహనాలను పోలీసు వారి సహకారంతో తొలగించవలసినదిగా టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ రామ్మోహన్ రావు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్మోహన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ప్రకాష్, రెవిన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, ప్రజా ప్రతినిధులు, అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'వ్యర్థాలతో కళాకృతుల నిర్మాణం' ప్రశంసనీయం



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం సుందరీకరణ పనుల్లో భాగంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం లాన్‌లో 'వేస్ట్ టు ఆర్ట్' ఆలోచనలతో నూతనంగా నిర్మించిన సింహం ఆకృతిని కమిషనర్ సూర్యతేజ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వ్యర్థాలను తిరిగి వినియోగించేలా కళాకృతులను రూపొందించి, ప్రజల్లో చైతన్యం కల్పించడమే ధ్యేయంగా సుందరీకరణ పనులను చేపట్టామని తెలిపారు. 'వ్యర్థాలతో కళాకృతులు' అంశంతో వాడిపడేసిన రబ్బర్ ముక్కలతో సింహం ఆకృతిని సృజనాత్మకంగా రూపొందించారని కమిషనర్ ప్రశంసించారు.

## శివుడు, నందికి అభిషేకం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేట లో వేంచేసియున్న శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవస్థానం లో మంగళవారం త్రయోదశి పర్వదినం పురస్కరించుకొని ఆలయంలో శ్రీ మూల స్థానేశ్వర స్వామికి, స్వామికి అభిముఖంగా ఉన్న నందికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. ఈ వేడుకను చూడడానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. అనంతరం రాత్రి నంది మీద స్వామి అమ్మ వార్ల పల్లకి సేవ జరిపారు. ఈ వేడుకలు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్యభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

## ఎమ్మెల్సీ బీద రవిచంద్రను కలిసిన రవిచంద్ర



**కావలి, మేజర్‌న్యూస్ :** ఎమ్మెల్యేల కోటా నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా రెండోసారి ఎంపికైన బీదా రవిచంద్రను సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి అనంతరం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా నిమిషాలు కావలి నియోజకవర్గం రాజకీయ పరిస్థితుల గురించి చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కోటయ్య చౌదరి, వై.గోపీచంద్ ఇతరులు ఉన్నారు.

## యువత పోరును విజయవంతం చేయండి : మేకపాటి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మార్చి 12వ తేదీ (నేడు) వైయస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో 'యువత పోరు'ను విజయవంతం చేయాలని ఉదయగిరి నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కలెక్టర్‌కు మెమొరాండం ఇచ్చే కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండీ ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి కక్ష సాధింపులకు ఇచ్చే ప్రాధాన్యతను పక్కనపెట్టి, ఇప్పటికైనా విద్యార్థుల ఆవేదన చూసి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు కట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈనెల12న యువత పోరుబాట కార్యక్రమంలో అన్నివర్గాల వారు పాల్గొని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని కోరారు.